

ఆంధ్రా క్రికెట్ జట్టుకు జిల్లా యువకుడి ఎంపిక


సుశాంత్

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 20: అండర్-19 ఆంధ్రా క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన నంబాళ్ల సుశాంత్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన మ్యాచ్‌ల్లో వరుస సెంచరీలు, అర్ధ సెంచరీలు చేయడంతో ఆయన్ను ఆంధ్రా క్రికెట్‌జట్టుకు సెలెక్టర్లు ఎంపిక చేశారు. 2024-25లో జరగనున్న లీగ్ కమ్ నాకౌట్ క్రికెట్ పోటీల్లో ఆంధ్రా జట్టు తరుఫున ఆడనున్నాడు. సుశాంత్ ఎంపికపై జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ఎన్.శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి శైలానీ, డా.రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

అక్కడో వరద కాలువ ఉండాలి!


కాలువ ప్రవహించే ప్రాంతంలో రహదారి, నిర్మాణాలు



- కిలోమీటరు పొడవునా కనిపించని వైనం
- 3.09 ఎకరాల స్థలంలో భారీ భవంతులు
- సర్వే నెంబర్లు మార్చి రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి
- ఎన్ని ఫిర్యాదులు చేసినా చర్యలు నిల్
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- డబ్బులు చేతులు మారాయని ఆరోపణలు
- తాము గెలిస్తే చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందు గౌతు శిరీష హామీ
- కూటమి ప్రభుత్వం ఆక్రమణలు తొలగించాలని ప్రజల డిమాండ్

(పలాస)

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల మధ్య నెమలికొండ నుంచి పురుషోత్తపురం ఎర్రచెరువుకు ప్రవహించే వరద కాలువ కిలోమీటరు పొడవు ఉంటుంది. గత ఐదేళ్లుగా ఈ కాలువ మొత్తం ఆక్రమణకు గురవుతోంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో భారీ భవంతులు వెలుస్తున్నాయి. ప్రభుత్వ రికార్డుల ప్రకారం మొత్తం 3.09 ఎకరాలు కబ్జాకు గురవుతున్నా.. రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్రమార్కులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారనేది చర్చనీయాంశమవుతోంది. అప్పట్లో అక్రమాలకు సహకరించిన అధికారుల్లోనూ గుబులు రేగుతోంది.

● శివాజీనగర్ సరిహద్దులో ఉన్న ఈ కొండవాగు ప్రాంతం భూములు ఎంతో విలువైనవి. భారీ వరదలు, వర్షాలు వచ్చినప్పుడు నెమలికొండ-సూదికొండ ప్రాంతంలో పడే నీరంతా ఈ వాగుద్వారా పురుషోత్తపురం కాలనీకి ఆనుకొని ఉన్న ఎర్రచెరువులో చేరుతుంది. కాగా, వైసీపీ హయాంలో ఈ కాలువ భూములను కబ్జా చేసి.. పక్కా రిజిస్ట్రేషన్లు చేసి విక్రయించారు. సర్వేనెంబర్లు: 9లో 22 సెంట్లు, 12లో 25 సెంట్లు, 13లో 25 సెంట్లు, 26లో 53 సెంట్లు, 28లో 1.84 ఎకరాల్లో కాలువ విస్తరించి ఉంది. ఇది నెమలికొండకు ఒకవైపు ఉన్న కాలువ భూములు, మరోవైపు సర్వేనెంబర్లు 41, 42, 43, 44లో ఉన్న భూముల్లో రహదారి నిర్మించినట్లు రికార్డుల్లో ఉన్నాయి. మొత్తం వివాదమంతా 3.09 ఎకరాల్లోనే ఉంది. ఈ భూముల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని సాక్షాత్తు రెవెన్యూ అధికారులే చెబుతున్నారు. ఎందుకంటే కొండలో కురిసే భారీ వర్షాలకు నీరంతా ఆ కాలువగుండా ప్రవహించి చెరువుకు చేరుతుంది. మొత్తం కాలువను కబ్జాచేసి నిర్మాణాలు చేయడంతో ప్రవహించే నీరుకు అడ్డుకట్టు వేసినట్లవుతుంది. దీనివల్ల సమీప చుట్టుప్రక్కల వరదనీరు ప్రవహించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.


కబ్జాకు గురై చివరకు.. కాలువ ఇలా పిచ్చి మొక్కలతో మిగిలింది..

తితలీ, ఫైలిన్, హుద్‌హుద్ వంటి తుఫాన్‌లు పునరావృతమైతే కొండదిగువన ఉన్న ఇళ్లల్లోకి భారీ నీరు చేరే ప్రమాదం ఉందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. మూడేళ్ల కిందట ఇక్కడ నిర్మించిన గృహ యజమానులకు అప్పటి టెక్కలి సబ్‌కలెక్టర్ హెచ్చరికలు జారీ చేయడంతో పాటు నోటీసులు అందించారు. మొత్తం 127 అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అప్పట్లోనే నివేదిక ఇచ్చారు. ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపు కావ డంతో రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అప్పట్లో అధికారదర్పం కారణంగా ఈ నిర్మాణాల జోలికి ఎవరూ వెళ్లలేదు.

అంతా పక్కాగా..

ఈ కాలువ భూముల్లో నిర్మిస్తున్న గృహాలన్నీ పక్కాగా రిజిస్ట్రేషన్లు చేయడం విశేషం. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి కేవలం రిజిస్ట్రేషన్ ఫీజు వసూళ్లు చేయడం తప్ప.. అది ప్రభుత్వ భూమా, ప్రైవేటు భూమా అన్న నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. దీనిపై భారీస్థాయిలో ముడుపులు తీసుకున్నట్లు ప్రచారం ఉంది. ఉదాహరణకు సర్వేనెంబరు 28లో ఉన్న భూమిని పొరుగు సర్వేనెంబరు జిరాయతీ భూమివి వేసి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ అక్రమాలకు మున్సిపల్ అధికారులు కూడా సహకరించార్న ప్రచా రం ఉంది. ఈ భూములకు ఎటువంటి పత్రాలు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నా వీఎల్‌టీ (ఖాళీ స్థలాలకు పన్నులు)లు అనేక మందికి ఇచ్చారు. దీనికి విద్యుత్ శాఖ సిబ్బంది కూడా తమవంతు సహాయం చేయడం కొసమెరుపు. కాలువల్లో ఎటువంటి డిమాండ్ లేకపోయినా విద్యుత్ స్థంబాలు వేసి వారి గృహాలకు విద్యుత్ యోగాన్ని కల్పించి స్వామిభక్తి చాటుకున్నారు. తప్పని తెలిసినా అందరికీ మామూళ్లు ఇచ్చి చేస్తున్నా మని, అధికారులు ప్రశ్నిస్తే వారి వ్యవహారాన్ని తీసుకు వస్తామని నిర్మాణదారులు చెబుతుండడం విశేషం. కొద్ది రోజుల కిందట ఇదే సర్వేనెంబరులో నిర్మిస్తున్న నిర్మాణాలను రెవిన్యూ అధికారులు కూల్చివేశారు. మరి కొన్ని పునాదులనే పీకివేశారు. అయితే లోతుగా చర్యలు తీసుకోలేదని స్పష్టమవుతోంది. పాత పట్టాలు సృష్టించి కొందరు రిజిస్ట్రేషన్లు చేయించారని తెలుస్తోంది. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సైతం ఆక్రమణలు గుర్తించి వారికి నోటీసులు ఇస్తున్నారు. అయితే దీనిపై తాము కోర్టులోనే తేల్చుకుంటామని చెబుతుండడం విశేషం. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వైసీపీ ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలువ భూములు కబ్జాలు చేసిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

● ఈ విషయమై రెవెన్యూ సర్వేయర్ వై.గిరి వద్ద ప్రస్తావించగా.. మొత్తం పురుషోత్తపురం- నెమలికొండ వరద కాలువ ఆక్రమణలు గుర్తించామని తెలిపారు. ఇప్పటికే దీనిపై అధికారులకు నివేదించామని, వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హాస్టళ్లలోకి బయటి ఆహారాన్ని అనుమతించొద్దు

- ఆర్వో ప్లాంట్‌ను అందుబాటులో ఉంచాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్ ఆగస్టు 20: జిల్లాలోని హాస్టళ్లలోకి బయటి ఆహారాన్ని అనుమతించవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ వసతి గృహాలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న హాస్టళ్లు, బాలల రక్షిత గృహాలు నడుపుతున్న యాజమాన్యాలతో ఆయన సమావేశం నిర్వహించారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందజేయాలని కోరారు. 'నిల్వ చేసిన నీరు తాగరాదు. హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు అందుబాటులో ఉంచాలి. తాజా పండ్లు, కూరగాయలు వాడాలి. 500 మందికిపైగా విద్యార్థులు ఉన్న హాస్టల్‌కు ప్రత్యేక అధికారి ఉండాలి. 500 లోపు విద్యార్థులు ఉన్న హాస్టళ్లకు కిందిస్థాయి అధికారి ప్రత్యేక అధికారిగా వ్యవహరించాలి. ఆహారం విషయంలో ఫిర్యాదులను 9704009989 నెంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేయాలి' అని కలెక్టర్ తెలిపారు. ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ మాట్లాడుతూ.. హస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి అనూరాధ, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, బీసీ సంక్షేమశాఖ ఏడీ విశ్వ మోహన్‌రెడ్డి, డీఈవో కృష్ణచైతన్య, రెసిడెన్షియల్ పాఠశాలల కోఆర్డినేటర్ బాలాజీ నాయక్, ఆర్ఐఓ దుర్గారావు, చైల్డ్ వెల్ఫేర్ అధికారి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆవులను వధించి.. విక్రయించి!

- బట్టబయలు చేసిన వీహెచ్‌పీ, భజరంగదళ్ సభ్యులు
- 200 కిలోల మాంసం.. రెండు ఆవుల గుర్తింపు
- విక్రయ కేంద్రాన్ని పరిశీలించిన పోలీసులు
- నిర్వాహకుడ్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు

పలాస, ఆగస్టు 20: కాశీబుగ్గ రైల్వేకాలనీ శివారున.. ఇందిరానగర్‌కాలనీలో బహిరంగంగా ఆవు మాంసం విక్రయాలు సాగుతున్నాయి. సమాచారం తెలుసుకున్న విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ తదితర హిందూ ధార్మిక సంస్థల సభ్యులు మంగళవారం మధ్యాహ్నం వెళ్లి పరిశీలించారు. సుమారు 200 కిలోలకు పైగా ఆవు మాంసం ఉన్నట్టు గుర్తించారు. దీనిపై నిర్వాహకుడ్ని నిలదీశారు. ఆవు మాంసం విక్రయాలపై మండిపడ్డారు. వధించేందుకు సిద్ధంగా ఉన్న రెండు ఆవులను చిన్నబాడాంలోని గో సంరక్షణ శాఖకు తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు.. ఆవు మాంసం విక్రయ కేంద్రానికి చేరుకుని పరిశీలించారు. మాంసం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ సంజీవరావు తెలిపారు.

● రైల్వేకాలనీకి ఆనుకుని ఉన్న ఆక్రమిత భూముల్లో మంగళవారం, శుక్రవారం సమయాల్లో భారీగా ఆవులను వధిస్తూ.. వాటి మాంసం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పదేళ్ల కిందట ఇదే ప్రాంతంలో ఆవు మాంస విక్రయ కేంద్రాన్ని పోలీసులు గుర్తించి మూసివేయించారు. తర్వాత కొన్నాళ్ల నుంచీ మళ్లీ ఇక్కడ విక్రయ కేంద్రం ద్వారా ఆవు మాంసాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు సమాచారం. ఆవుల మాంసాన్ని విక్రయిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని భజరంగదళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు.


గో మాంసం కేంద్రం వద్ద విక్రయాలపై ఆరా..

ఆ నలుగురూ.. రెండేళ్లుగా!

- పగలు రెక్కీ నిర్వహించి రాత్రి చోరీలు
- జిల్లాలో పలు చోట్ల దొంగతనాలు
- అందరూ ఒడిశా, బెంగాల్ వాసులు
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- 85 గ్రాముల బంగారం, రూ.7వేల నగదు, ఐదు సెల్‌ఫోన్‌ల స్వాధీనం

టెక్కలి, ఆగస్టు 20: ఆ నలుగురూ.. అంతరాష్ట్ర ముఠా సభ్యులు. రెండేళ్లుగా జిల్లాలో ఇచ్ఛాపురం, జలుమూరు, కాశీబుగ్గ, టెక్కలి ప్రాంతాల్లో పలు నేరాలకు పాల్పడ్డారు. పగలు రెక్కీ వేసి రాత్రి చోరీ చేసేవారు. ఒడిశా, బెంగాళ్ ప్రాంతాలకు చెందిన ఆ నలుగురినీ స్పెషల్‌క్రైమ్ కంట్రోల్ టీమ్ చాకచక్యంగా పట్టుకుంది. వారి నుంచి బంగారం, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుంది. ఈ వివరాలను సీఐ పి.పైడయ్య మంగళవారం టెక్కలి పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు. 'సోమవారం పలాస ఎల్‌సీ గేటు వద్ద ఓ నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగారు. వారిని ఎస్‌ఐ కె.మధుసూదనరావు, స్పెషల్ క్రైం కంట్రోల్‌టీమ్ సభ్యులు బి.లోకనాథం, బి.ఉమామహేశ్వరరావు, మాధవరావు చాకచక్యంగా పట్టుకున్నారు. వారిని విచారించగా.. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ ప్రాంతానికి చెందిన నిభూదాస్, తరేమిరాయ్, పశ్చిమబెంగాళ్‌కు చెందిన దిలీప్‌రాయ్, దీపాంకర్‌రాయ్‌గా గుర్తించారు. ఆ నలుగురు 2022 ఆగస్టు 4న ఇచ్ఛాపురానికి చెందిన వంకల ప్రదీప్‌కుమార్ నివాసంలో చోరీ చేశారు. 2023 సెప్టెంబరు 9న పలాస మండలం గరుడఖండిలో దంత రాజారావు ఇంట్లో నగదు, ఆభరణాలు దొంగిలించారు. 2024 ఫిబ్రవరి 13న తిలారు ఆర్ఎస్‌లోని వైశ్యరాజు సంతోషరావు నివాసంలో చోరీ చేశారు. ఈ ఏడాది జూన్ 22న టెక్కలిలోని వంశధార కాలనీలో నిరాకర్‌టీఫ్ నివాసంలో, అదేరోజు రాత్రి కోడూరు జయశ్రీ నివాసంలో దొంగిలించారు. ఈ ఏడాది జూలై 31న రోటరీనగర్-1లోని కర్రి వేణుగోపాలరావు నివాసంలో చోరీకి పాల్పడినట్టు విచారణలో తేలింది. వారి వద్ద రూ.6.29లక్షల విలువగల 85 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.7వేల నగదు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. వారిని అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తామ'ని సీఐ పైడయ్య తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ నర్సింగరావు, సీసీఎస్ సిబ్బంది ఉన్నారు.


పోలీసుల అదుపులో అంతరాష్ట్ర ముఠా సభ్యులు

ఎస్ఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 20: విశాఖరేంజ్ పరిధిలో 26 మంది ఎస్ఐలకు మంగళవారం బదిలీలు చేస్తూ డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ	ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ
ఎస్.చిరంజీవి	ఎచ్చెర్ల	జేఆర్ పురం	జి.అప్పారావు	సారవకోట	విశాఖ వీఆర్
కె.గోవిందరావు	జేఆర్ పురం	శ్రీకాకుళం వీఆర్	ఆర్.సంతోష్	అరకు	శ్రీకాకుళం టూటౌన్-1
గుండ లక్ష్మణరావు	పాడేరు	లావేరు	హరికృష్ణ	టూటౌన్	శ్రీకాకుళం వీఆర్
స్వామినాయుడు	లావేరు	విశాఖ వీఆర్	బి.లావణ్య	మన్యం జిల్లా	పాతపట్నం
మొజ్జాడ ప్రవళిక	మహిళాస్టేషన్	బూర్జ	ఎండి.యాశీన్	పాతపట్నం	హిరమండలం
గొండెల ప్రసాద్	బూర్జ	విశాఖ వీఆర్	జి.నారాయణస్వామి	హిరమండలం	శ్రీకాకుళం వీఆర్
వి.సత్యనారాయణ	ఇచ్ఛాపురంటౌన్	పొందూరు	బి.రేవతి	మహిళాస్టేషన్	కాశీబుగ్గ-1
సి.దుర్గాప్రసాదరావు	అల్లూరి జిల్లా	నరసన్నపేట	పారినాయుడు	కాశీబుగ్గ	శ్రీకాకుళం వీఆర్
గర్బాపు రంజాత్	అల్లూరి జిల్లా	పోలాకి	ఎస్‌కె.ఖాదర్	డీఎస్‌బీ	మందస
బి.అశోక్	నరసన్నపేట	జలుమూరు	చిన్నంనాయుడు	చిన్నమేరంగి	ఇచ్ఛాపురం టౌన్
కె.మధుసూదనరావు	జలుమూరు	శ్రీకాకుళం వీఆర్	ఈ.శ్రీనివాస్	ఆర్ ఏ.వలస	ఇచ్ఛాపురం రూరల్
వి.సత్యనారాయణ	పోలాకి	శ్రీకాకుళం వీఆర్	ఎస్.లక్ష్మణరావు	ఇచ్ఛాపురం రూరల్	విశాఖ వీఆర్
బి.అనీల్‌కుమార్	మందస	సారవకోట	కె.లక్ష్మణరావు	శ్రీకాకుళం వీఆర్	మహిళా స్టేషన్

బియ్యం బస్తాలకు కన్నం!

- మండల స్థాయి గోదాముల్లో చేతివాటం
- నెలకు డీలర్లకు రూ.లక్షల్లో నష్టం
- లబ్ధిదారులపైనే దోపిడీ భారం


డిపో వద్ద బియ్యం బస్తాలు..

(హరిపురం)

రేషన్ బియ్యం తూకాల్లో మతలబు జరుగుతోంది. జిల్లాలో ప్రతి నెలా రూ.లక్షల్లో నిధులు గోల్‌మాల్ అవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. కాగా.. ఒక్కో చౌక ధర దుకాణానికి ప్రతి నెలా సుమారు రెండు క్వింటాళ్ల వరకూ కొరత వస్తోందని డీలర్లు వాపోతున్నారు. ఆ నష్టాన్ని కార్డుదారులపైనే వేస్తూ.. తూకంలో కోత విధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో 1,603 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 15 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. రేషన్ డిపోలకు ప్రతి నెలా 10.2వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతున్నాయి. ఇందులో 6.4.లక్షల కిలోల తరుగు కనిపిస్తోంది. అంటే 604.45టన్నుల బియ్యం కోత పడుతోంది. టన్ను రూ.22వేల చొప్పున లెక్కిస్తే వీటి విలువ రూ.1.32కోట్లు ఉంటుంది. ఈ మొత్తం ఎవరి జేబులోకి వెళ్తుందోనన్నది చర్చనీయాంశమవుతోంది. పరోక్షంగా ఈ నష్టం లబ్ధిదారులపైనే పడుతోంది. లబ్ధిదారుల లెక్క ప్రకారం.. రేషన్ డీలర్ల నుంచి ఎండీయూ ఆపరేటర్లకు బియ్యం, ఇతర సరుకులు తూకం వేసి ఇవ్వాలి. ఎండీయూ ఆపరేటర్లు పంపిణీ చేయగా మిగిలిన బియ్యాన్ని తిరిగి డీలర్లకు అందజేస్తారు. కాగా ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద బస్తాల లెక్కన సరఫరా చేస్తుండడంతో ప్రతి డిపోలోనూ బియ్యం తరుగు వస్తోందని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే కమిషన్ గిట్టుబాటు కావడం లేదని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తరుగు భారం లబ్ధిదారులపై వేస్తున్నారు. కాగా.. బియ్యం లోటు భర్తీకి డీలర్లు పక్కదారి చూస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈక్రమంలో తనిఖీల సమయంలో డీలర్లపై కేసులు నమోదవుతున్నాయి.


50 కేజీల బియ్యం బస్తాలో కోత ఇలా..

వామ్మో 5 కేజీల వరకు తేడా..

మండల స్థాయి నిల్వ గోదాముల వద్ద సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. తూకం లేకుండానే డీలర్లుకు బియ్యం అందిస్తున్నారు. ఒక బియ్యం సంచి 50 కేజీలు ఉండాలి. కానీ అది 45 నుంచి 47 కేజీలు మాత్రమే ఉంటోందని డీలర్లు చెబుతున్నారు. పది క్వింటాళ్ల పంపిణీ చేయాల్సిన ఒక చౌక ధర దుకాణానికి 80 నుంచి 100 కేజీల వరకు తరుగు వస్తోంది. ఆ మేరకు డీలర్లు భరించాల్సి ఉంది. ఎఫ్‌సీఐ గోదాముల నుంచి తూకం వేసిన బియ్యం బస్తాలు మొదటి దశ రవాణా కాంట్రాక్టరు ఎల్ఎస్‌పీ పాయింట్లు గోదాములకు తీసుకొస్తారు. డీడీలు చెల్లించిన డీలర్లకు అవసరమైన సరుకులు.. తిరిగి దుకాణాలకు స్టేజి-2 కాంట్రాక్టరు రవాణా చేస్తారు. మండల స్థాయి నిల్వ గోదాములో సరుకులు ఎగుమతి చేసే సమయంలో ఇండెంట్ ప్రకారం తూకం వేసి ఇవ్వాల్సి ఉన్నా.. అలా చేయడం లేదు. దీనిపై నిలదీస్తే తనిఖీల పేరుతో మళ్లీ కేసులు నమోదు చేస్తారేమోనని భయపడి డీలర్లు నిస్సహాయంగా ఉండిపోతున్నారు.

గోదాములకు చేరే సమయంలోనే..

మిల్లర్ల నుంచి గోదాములకు టన్నుల రూపంలో బియ్యాన్ని లారీల్లో సేకరిస్తారు. పెద్ద కాటా వేసి ఒక్కో లారీ ఎన్ని టన్నులో లెక్కించి గోదాముల్లో నిల్వచేస్తారు. ఆ సమయంలోనే కొంతమంది మిల్లర్లు, గోదాములోని కిందిస్థాయి సిబ్బంది చేతివాటంతో బియ్యం కోత వేస్తున్నారు. బియ్యం పాకెట్లలో 50కిలోల కన్నా తక్కువ ఉన్నా.. టన్నేజీ సరిపోయినట్లు లెక్క చూపుతున్నారు. దీంతో డీలర్ల వద్దకు వచ్చేసరికి ఒక్కో 50 కేజీల బస్తాకు 3కేజీల వరకూ తరుగు వస్తోంది.

తీవ్రంగా నష్టపోతున్నాం..



50 కేజీల బస్తాకు 3 నుంచి 5 కిలోల వరకూ తక్కువగా బియ్యం వస్తున్నాయి. ఎండీయూ ఆపరేటర్లుకు డీలర్లు మాత్రం సరిగ్గా తూకం వేసి అందజేయాల్సిన పరిస్థితి. దీంతో సొంతంగా బియ్యం బయట కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందజేయాల్సిన దుస్థితి నెలకొంది. తీవ్రంగా నష్టపోతుండడంతో గ్రామస్థాయిలో కొంతమంది డీలర్లు.. బాధ్యతల నుంచి తప్పుకొంటున్నారు.

-మూర్తి, డీలర్ల సంఘం అధ్యక్షుడు, మందస

పక్కా తూకంతోనే...

డీలర్లుకు ఎల్ఎస్‌పీ పాయింట్లు వద్ద పక్కా తూకం వేసి సరఫరా చేస్తున్నాం. తరుగు సమస్య రాదు. బియ్యం బస్తాలకు పలుమార్లు ఎగుమతి, దిగుమతి సమయంలో హుక్కులు వేయటంతో నామమాత్రంగా తరుగు ఉంటుంది. ఫోర్టిఫైడ్ బియ్యంతో తాజాగా వచ్చిన నిల్వలు పూర్తి తూకంతోనే అందిస్తున్నాం.

-శ్రీనివాసరావు, డీఎం, శ్రీకాకుళం

ఎన్‌జీ రంగా వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.

విభాగాలు: అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్ (హోంసైన్స్)

స్పెషలైజేషన్‌లు:

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

క్యాంపస్‌లు

- బాపట్ల, తిరుపతి, నైరా, మహానంది అగ్రికల్చరల్ కాలేజీలు
- గుంటూరులోని ఏపీజీసీ
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- లామ్‌లోని అడ్వాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్

అర్హత: పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BYXem1hలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

Alstom India

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.

Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply.

- Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.
- The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources.
- The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/AISDG7

Legrand Empowering

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.

- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

***Special category:** Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.

- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

***Special category:** Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Last Date to Apply: 05-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/LFLS9

SCHOLARSHIP ALERT

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

చిత్రకు లతా మంగేష్కర్ అవార్డు



ప్రఖ్యాత నేపథ్య గాయకురాలు కె.ఎస్.చిత్ర, సంగీత దర్శకుడు ఉత్తమ్ సింగ్‌లను దివంగత గాయని లతా మంగేష్కర్ స్మారక పురస్కారాలు వరించాయి. మధ్యప్రదేశ్‌లో సెప్టెంబరు 28న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంగళవారం ప్రకటించింది. ప్రతీ ఏటా లతా మంగేష్కర్ జయంతి రోజున ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. 2022 సంవత్సరానికి ఉత్తమ్ సింగ్, 2023 సంవత్సరానికి చిత్ర ఈ అవార్డులు అందుకోనున్నారు. లత స్మారకార్థం మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిన నూతన ఆడిటోరియంలో ఈ అవార్డులను బహూకరిస్తారు.

అందరికీ ధన్యవాదాలు



తన ఆరోగ్యం బాగుండాలని కోరుతూ దేవుడిని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ప్రముఖ నేపథ్యగాయని పి.సుశీల పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా ఈ నెల 17న నగరంలోని ఒక కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆమె... సోమవారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆమె భావోద్వేగంతో అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. 'తమిళ అభిమానులకు నాపై ప్రత్యేక ప్రేమ ఉంది. వారికి పాటలంటే ప్రాణం. అందుకే భగవంతుడు నన్ను పంపాడు. దేవుడు నాకు ఇంత మంచి గొంతు ఎందుకు ఇచ్చాడో ఇప్పుడు అర్థమైంది. దేవుడి దయ వల్లే ఇదంతా సాధ్యమైంది' అని ఆమె పేర్కొన్నారు.

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

సర్దుకుపోవడం.. రాజీపడటం...

మలయాళ పరిశ్రమలో ఈ రెండూ చాలా ఫేమస్ ● మల్లూవుడ్‌లో మహిళల సమస్యలపై హేమ కమిటీ రిపోర్ట్
● పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలని కండిషన్ ● అంగీకరిస్తే కోడ్‌నేమ్, ఎదురు తిరిగితే అప్రకటిత నిషేధం



2017లో నటి భావన కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ ఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే హేమ ఈ కమిటీకి ఛైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటక రాకుండా ఇన్నాళ్లు ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి.

మలయాళ చిత్రసీమలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. మల్లూవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను సూచించేందుకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. మహిళలపై వేధింపులు, శ్రమ దోపిడి, అసభ్యంగా ప్రవర్తించడం లాంటివి సాధారణంగా మారాయని, క్రిమినల్ గ్యాంగ్స్ కనుసన్నల్లో మలయాళ చిత్రపరిశ్రమ నడుస్తోందని కమిటీ ఆరోపించింది. సమస్య పరిష్కారానికి పటిష్ఠ చట్టం అవసరమని, ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలని కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాలు విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు.

కమిటీ గుర్తించిన ముఖ్యమైన అంశాల్లో కొన్ని

- షూటింగ్ సమయంలో మహిళలకు మరుగుదొడ్డి సదుపాయాల కొరత ఉంది. ఈ-టాయ్‌లెట్‌లు సరిపడా స్థాయిలో ఉండడం లేదు. అలాగే దుస్తులు మార్చుకునేందుకు సరైన గదులు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు భయపడాల్సి వస్తోంది.
- ప్రొడక్షన్ మేనేజర్లు అవకాశాల కోసం తమను కలిసే మహిళలను లొంగదీసుకుంటున్నారు. 'పరిస్థితులను బట్టి సర్దుకుపోండి, కొన్ని విషయాల్లో రాజీపడండి అలాగైతేనే మీకు మా సినిమాలో అవకాశం ఇస్తాం' అని కండీషన్ పెడుతున్నారు. 'పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలి' అని షరతుడు పెడుతున్నారు. సర్దుకుపోవడం, రాజీపడడం... అనే ఈ రెండు మలయాళ చిత్రసీమలో చాలా ఫేమస్ అని కమిటీ నివేదికలో పేర్కొంది.
- షూటింగ్‌లో తమకు కేటాయించిన వసతి గృహాల్లో ఒంటరిగా ఉండాలంటే మహిళా నటీమణులు భయపడుతున్నారు. ఎవరు ఎప్పుడు తాగి వచ్చి తలుపు కొడతారో అనే భయంతో స్నేహితులనో, బంధువులనో తోడు తెచ్చుకుంటున్నారు. తాము బస చేసిన హోటళ్లలో, షూటింగ్స్‌లో ఉన్న మగవాళ్లు ఎక్కువ సార్లు మత్తులో జోగుతూ తమ తలుపు తట్టారని కమిటీ ముందు చెప్పారు. వారించినా పదే పదే తలుపులు కొడుతున్నారనీ, వాళ్లు తలుపులు బద్దలు కొట్టుకొని లోపలికి వచ్చి తమను ఏమైనా చేస్తారేమోనని చాలాసార్లు భయపడినట్లు తెలిపారు. చిత్రీకరణకు ముందే ఓ హీరో, హీరోయిన్‌ను లైంగికంగా వేధించాడు. ఆ ప్రభావం ఆమె నటనపై పడింది. అతనిపైన ఉన్న ద్వేషమే ఆమె ముఖంలో ప్రతిఫలించింది. దీనివల్ల ఒక్కషాట్‌కు ఆమె 17 టేక్‌లు తీసుకోవాల్సి వచ్చింది. దీంతో డైరెక్టర్ ఆమెను తిట్టాడు.

ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలి

రిటైర్డ్ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ట్రిబ్యూనల్ పనిచేయాలి. కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న మహిళా న్యాయమూర్తులను నియమించాలి. మహిళలకు సురక్షితమైన వసతి, రవాణా, టాయిలెట్‌లు, ఉండే దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలి. షూటింగ్‌లో డ్రగ్స్, మద్యంపై నిషేధం విధించాలి. జూనియర్ ఆర్టిస్టులకు వర్క్ కాంట్రాక్ట్‌లను అమలు చేయాలి. మహిళలకు వారి ప్రతిభ, శ్రమకు తగ్గ పారితోషికం అందేలా చూడాలి. సమాన అవకాశాలతో పాటు అందరినీ కలుపుకొని పోయే వాతావరణాన్ని పరిశ్రమలో సృష్టించాలని నివేదిక సూచించింది.

స్టార్‌డమ్‌తో ఇబ్బందులు

లైంగికవేధింపులకు గురైన నటీమణులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. తమతో పాటు తమ కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయమే దీనికి కారణం. సామాన్య మహిళలతో పోల్చితే సెలబ్రిటి స్థాయిలో ఉన్నవాళ్లు ఎక్కువగా ఇలాంటి ఇబ్బందులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. సైబర్ దాడులు సహా పలు రూపాల్లో వారిపై దాడి చేస్తున్నారు. తమ కుటుంబం పరువు పోతుందనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని మహిళలు చెబుతున్నారు. కోర్టు, పోలీసులను ఆశ్రయిస్తే, ప్రాణహానితో పాటు కుటుంబం మొత్తం దారుణమైన పరిస్థితులు చవి చూడాల్సి వస్తుందని భయపడుతున్నారు.

పలుకుబడి పనిచేస్తోంది

- కొందరు పలుకుబడి ఉన్న నిర్మాతలు, దర్శకులు, నటీనటులు ప్రొడక్షన్ కంట్రోలర్స్ లాంటి పవర్‌ఫుల్ వ్యక్తులు పరిశ్రమను నియంత్రిస్తున్నారని నివేదిక పేర్కొంది. తమ పలుకుబడిని ఉపయోగించి పరిశ్రమలో అవకాశాలు రాకుండా చేస్తారని మహిళలు భయపడుతున్నారు. లైంగిక వేధింపులకు గురైనప్పుడు ఫిర్యాదు చేస్తే, వారిపైన అప్రకటిత నిషేధం కొనసాగుతుంది. తర్వాత మరో సినిమాలో అవకాశం రాకుండా చేస్తున్నారు. దీనివల్ల తమ కెరీర్ బుగ్గి అవుతుందని మహిళలు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారు.
- అగ్రతారలకు మినహా ఇతర నటీనటులకు పారితోషికానికి సంబంధించి ఎలాంటి రాతపూర్వక ఒప్పందాలు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు, జూనియర్ యాక్టర్స్‌కు పూర్తి పారితోషికం అందడం లేదు. డిమాండ్ చేసే వీలు కూడా ఉండడం లేదు.



శ్రద్ధాకు రూ. 5 కోట్లు.. తమన్నాకు రూ. కోటి!

శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు నటించిన 'స్త్రీ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది. పోటీలో రెండు చిత్రాలు ఉండడంతో వాటికంటే ఒక రోజు ముందు విడుదల చేస్తే హిట్ గ్యారంటీ అనుకున్న నిర్మాతల అంచనాలు వమ్ము కాలేదు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో సత్తా చాటిన 'స్త్రీ 2' చిత్రం విడుదలయ్యాక వసూళ్లలోనూ ముందంజలో ఉంది. ఈ నెల 14న విడుదలైన ఈ చిత్రం తొలి ఐదు రోజుల్లోనే దాదాపు రూ.322 కోట్ల గ్రాస్‌ను సాధించింది. సూపర్ న్యాచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2' విడుదలైన మర్నాడు వచ్చిన 'వేద', 'ఖేల్ ఖేల్ మే' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ధాటిని తట్టుకోలేక కలెక్షన్లలో తేలిపోయాయి. కాగా, 2018లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'స్త్రీ' చిత్రానికి ఇది సీక్వెల్‌గా తెరకెక్కింది. రెండు భాగాలకూ అమర్ కౌశిక్ దర్శకత్వం వహించగా, మ్యాడోక్ ఫిల్మ్, జియో సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.

అయిదు నిమిషాలకు కోటి

నటి తమన్నా 'సరిలేరు నీకెవ్వరు', 'జైలర్', 'జై లవ కుశ' లాంటి సినిమాల్లో ప్రత్యేక గీతాల్లో తళుక్కుమన్న సంగతి తెలిసిందే. ఆమె తాజాగా, 'స్త్రీ 2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్' అనే ఐటెం సాంగ్‌లో నటించారు. ఈ సినిమాలో హీరోగా నటించిన రాజ్‌కుమార్ రావుకు రూ. ఆరు కోట్లు, హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు రూ. ఐదు కోట్లు పారితోషికంగా ఇచ్చారు. అయితే ఐటెం సాంగ్‌లో అయిదు నిముషాలు అలా మెరిసిన తమన్నా ఆ పాట కోసం ఏకంగా రూ. కోటి రూపాయలు వసూలు చేశారట. ఆమె నర్తించిన ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. 'స్త్రీ' మొదటి భాగంలో నోరా ఫతేహి ప్రత్యేక గీతం కోసం రూ.25 లక్షలు తీసుకోగా.. రెండో భాగానికి తమన్నా నాలుగు రెట్లు అధికంగా తీసుకోవడం విశేషం. తమన్నా డిమాండ్ అలా ఉంది మరి!



పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్ అమ్మకానికి!

నటి సోనాక్షి సిన్హా ఇటీవలే పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆమె తను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌ను అమ్మకానికి పెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గత ఏడాది సెప్టెంబరులో ముంబైలోని బాంద్రాలో రూ.11 కోట్లు పెట్టి ఆమె ఓ ఇంటిని కొన్నారు. అదే అపార్ట్‌మెంట్లో ఇటీవలే ఆమె జహీర్ ఇక్బాల్‌ను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆ అపార్ట్‌మెంట్‌ను ఆమె రూ.25 కోట్లకు అమ్మకానికి పెట్టారు. ఏడాది కూడా కాకుండానే.. అదీ వారిద్దరి పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్‌ను ఇలా సడెన్‌గా అమ్మకానికి పెట్టడం అందరిలో కుతూహలాన్ని రేకెత్తిస్తోంది. అసలు ఈ అపార్ట్‌మెంట్ అమ్మడానికి అసలు కారణం ఏంటా అని అభిమానులు నెట్టింట చర్చిస్తున్నారు.


అసూయతో వచ్చిన మాటలవి





ప్రభాస్‌పై బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలను హీరో సుధీర్‌బాబు, దర్శకుడు అజయ్ భూపతి తప్పుపట్టారు. మంగళవారం సోషల్‌మీడియాలో ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. "అర్షద్ వార్సీ నుంచి ఇలాంటి ప్రొఫెషనలిజం లేని మాటలు రావడం అస్సలు ఊహించలేదు. విమర్శనాత్మకంగా మాట్లాడవచ్చు కానీ ఇలా చులకనగా మాట్లాడ్డం సరికాదు. ఇలాంటి అనవసర వ్యాఖ్యలను పట్టించుకునే తీరిక ప్రభాస్‌కు లేదు. ఆయన స్థాయి చాలా పెద్దది" అని ఎక్స్‌లో సుధీర్‌బాబు పేర్కొన్నారు. "భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లడానికి.. తన వంతుగా ఏమైనా చెయ్యడానికి ప్రభాస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆయన మన దేశానికే గర్వకారణం. ఈ మాటలన్నీ వార్సీ నుంచి అసూయతో వచ్చినవే" అని దర్శకుడు అజయ్ భూపతి ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ఇటీవలే అర్షద్ వార్సీ, 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో ప్రభాస్ లుక్ జోకర్‌లా ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

కొత్తగా..



విడుదల తేదీ మారింది

వివిధ భాషల్లో సినిమాలు చేస్తూ తెలుగులో కూడా తనకంటూ అభిమానుల్ని ఏర్పరచుకున్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం కోసం 1980ల నాటి ముంబై నగరాన్ని పునర్నిర్మించడం విశేషం. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించిన ఈ సినిమాను మొదట సెప్టెంబర్ ఏడున విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. ఈ మార్పు గురించి చిత్ర నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య మాట్లాడుతూ 'షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్నా నిర్మాణానంతర కార్యక్రమాలకు అదనపు సమయం పడుతోంది. వెండితెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించడం కోసం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఎక్కడా రాజీ పడడం లేదు. అందుకే విడుదల తేదీ మారింది' అని చెప్పారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా 'లక్కీ భాస్కర్' విడుదల కానుంది.

దసరాకి వస్తున్న రాజావారు



'మ్యాడ్', 'ఆయ్' వంటి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్స్ హిట్‌తో దూసుకుపోతున్న నార్నే నితిన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సంపద హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సతీశ్ వేగేశ్న దర్శకుడు. చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌కు నచ్చి, ఎంపిక చేసిన కథతో మా సినిమా రూపుదిద్దుకుంది. ఆయన అంచనాల మేరకు దర్శకుడు సతీశ్ ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని రూపొందించారు. భారీ తారాగణంతో పూర్తి కమర్షియల్ ఫార్మెట్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాను దసరాకు విడుదల చేస్తున్నాం. ఇది నార్నే నితిన్‌కు హ్యాట్రిక్ ఫిల్మ్ అవుతుంది' అని చెప్పారు.

ప్రేమోత్సవం



దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా చిత్రంలోని 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' పాటను విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ గీతానికి అనూప్ రూబెన్స్ స్వరాలు అందించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదలవుతుంది.

చిక్కుల్లో 'జైలర్' దర్శకుడి సతీమణి

ఇటీవల జరిగిన బీఎస్పీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ హత్య కేసులో 'జైలర్' చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ సతీమణి మోనీషాను నగర పోలీసులు విచారిస్తున్నారు. ఈ హత్య కేసు విచారణలో భాగంగా ఇప్పటికే 23 మందిని అరెస్టు చేయగా, ఓ నిందితుడు పోలీస్ ఎన్‌కౌంటరులో ప్రాణాలు కోల్పోయాడు. ఇందులోభాగంగా, పేరుమోసిన రౌడీ మొట్టై రాజేంద్రన్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొట్టై రాజేంద్రన్ దేశం విడిచి పారిపోయినట్టు సమాచారం. ఆయన పారిపోయేముందు మోనీషాతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించడంతో ఆమె చిక్కుల్లో పడ్డారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

● మండల సమావేశంలో ఎమ్మెల్యే రమణమూర్తి



ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని సత్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

పోలాకి: ఎన్నికల సమయంలోనే రాజకీయాలని.. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా పని చేద్దామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెడతానన్నారు. మండల పరిషత్, ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేద్దామన్నారు. పలువురు సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. మండల సమావేశానికి తొలిసారిగా వచ్చిన ఎమ్మెల్యే రమణమూర్తిని ఎంపీపీ ముద్దాడ దమయంతి, జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఉషశ్రీ, తహసీల్దార్ ఎం.సురేష్ కుమార్, మండల ఉపాధ్యక్షులు కోట అప్పారావు, కలదండు తాతా రావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యం కావాలి

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం: నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని ఐదు మండలాల వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో నిర్వహించనున్న గ్రామసభలను పాలకులు, నాయకులు ప్రజా భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దీనికి సంబంధించి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ చిట్టిరాజు, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాల రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఉపాధి, వ్యవసాయశాఖాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తరలిస్తున్న దృశ్యం

టెక్కలి: మదన గోపాల సాగరం ఎత్తి పోతల పథకానికి సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు, డీపీ ఆయిల్ చోరీ జరిగిన నేపథ్యంలో మంగళవారం వాటిని మరమ్మతులు చేపట్టేందుకు గాను టెండర్లు దక్కించుకున్న సంస్థ ఇక్కడి నుంచి తరలించింది. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'సాగు నీటికి పాట్లు' శీర్షికతో వచ్చిన కథనానికి ఏపీ ఎస్‌పీడీసీ అధికారులు స్పందించారు. రైతులు పినకాన అజయ్‌కుమార్, పోలాకి షణ్ముఖరావు, దారపు పాపారావు తదితరులు తమ సొంత నిధులతో క్రేన్ల సాయంతో ట్రాన్స్‌ఫార్మర్లను పొలాల నుంచి తీసుకువచ్చి సంస్థ ప్రతినిధులకు అప్పగించారు.

స్కూల్ స్వీపర్లకు వేతన బకాయిలు చెల్లించాలి

పలాసరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, స్వీపర్ల సంఘం ప్రతినిధులు పి.సుశీల, బి.స్వాతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈవో కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావుకు అందించారు. గత నాలుగు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులుపడుతున్నామన్నారు. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో శానిటేషన్ వర్కర్లు ఆదమ్మ, సరసమ్మ, ఉమ, బి.శకుంతల తదితరులు పాల్గొన్నారు.

పీఏపై దుష్ప్రచారం చేస్తే ఉపేక్షించేది లేదు: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట: నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ టిఫిన్ దుకాణం వద్ద యువకుల గలాటాలో పీఏ గణపతి చేశాడంటూ వైసీపీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొందరు యువకులు చేసిన గొడవను పీఏకి ఆపాదిస్తూ ట్రోల్ చేయడం సరికాదన్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులను అదుపులోకి తీసుకుని వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. పట్టణ ప్రజలు ఏ నమ్మకంతో తనను గెలిపించారో ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టణంలో పేద, మధ్యతరగతి వర్గాలు శాంతియుతంగా వ్యాపారాలు చేసుకునేలా, శాంతిభద్రతలను పరిరక్షించడం జరుగుతుందన్నారు. తప్పుడు ప్రచారం చేసిన వారిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ చేయాలని పోలీసులను కోరానన్నారు. ఈ విషయమై ఎస్ఐ అశోక్‌బాబు వద్ద ప్రస్తావించగా టిఫిన్ షాపు వద్ద జరిగిన గలాటా అంతగా లేదని, అయితే ఎవరు చేశారో గుర్తించి వారిని అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు బకాయిలు చెల్లించాలి

టెక్కలి: గ్రామసచివాలయాల్లో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లకు సక్రమంగా వేతనాలివ్వడం లేదని, తక్షణం బకాయిలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు నంబూరు షణ్ముఖరావు కోరారు. మంగళవారం టెక్కలి మండలం బొరిగిపేట, శ్యామ సుందరాపురం గ్రామ పారిశుధ్య కార్మికులు బమ్మిడి శివ, రోణంకి నందయ్య, బలగ మల్లేశ్వరరావుతో కలిసి ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్మికులు తమ వేతనాలను చెల్లించాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా మేఘవరం, బొప్పాయిపురం గ్రామ సచివాలయాల కార్యదర్శులు కనీసం పట్టించు కోవడం లేదన్నారు. తక్షణం బకాయిలు చెల్లించాలని లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు స్పష్టం చేశారు.

అవగాహనతోనే లక్ష్య సాధన

ఎల్.ఎన్.పేట: అవగాహనతో లక్ష్యాలను సాధించుకోవచ్చని ఎంఈవో సీహెచ్ మణికుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ సార్వత్రి విద్యాపీఠం (దూర విద్య) 2024-2025 విద్యాసంవత్సరానికి గాను పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి గాను గ్రామాల్లో అవగాహన కలిగించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సీఏలు, సచివాలయాల సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఒకరోజు సదస్సు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి హైమవతి, ఎంఈవో2 కె.చంద్రమౌళి, వెలుగు ఏపీఎం రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ● **పోలాకి:** ప్రభుత్వం అమలుచేస్తున్న దూరవిద్యపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కలిగించేం దుకు మంగళవారం విద్యాశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డ్రాపవుట్స్ ఇంట్లో ఉండి దూరవిద్యలో చదువుకుని పరీక్షలు రాయవచ్చని ఎంఈవోలు శ్రీనివాసనాయక్, లింగరాజు తెలిపారు. సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దగూడను గొట్టిపల్లి సచివాలయంలో చేర్చాలి

హిరమండలం: పెద్దగూడ పంచాయతీని కొత్తూరు మండలం గొట్టిపల్లి సచివాలయం పరిధిలోకి చేర్చాలని సర్పంచ్ సవర నందినితో పాటు పలువురు గిరిజనులు కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును శ్రీకాకుళంలో కలిసి వినతిపత్రం అందించారు. ఎనిమిది గిరిజన గ్రామాలతో కొండూరు ముఠాగా పెద్దగూడ పంచాయతీ ఏర్పడిందన్నారు. అయితే ఈ గ్రామాల నుంచి మర్రిగూడ సచివాలయానికి వెళ్లాలంటే హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల మీదుగా సుమారు 35 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులతో పాటు వివిధ పనులపై మర్రిగూడ సచివాలయానికి వెళితే మీ గ్రామం కొత్తూరు రెవెన్యూ పరిధిలో ఉందని అక్కడకు వెళ్లాలని అధికారులు చెబుతున్నారన్నారు. కొత్తూరు మండలంలోని అధికారులను కలిస్తే హిరమండలం వెళ్లాలని పంపించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామాలకు గొట్టిపల్లి సచివాలయంలో చేర్చాలని వారు కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కోటబొమ్మాళి: మండల పరిధి తర్లిపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఆయిల్ ప్యాకెట్లు, డబ్బాలతో వెళుతున్న లారీ ప్రమాదానికి గురైంది. శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం ఆయిల్ ప్యాకెట్లు, డబ్బాలను తరలిస్తున్న లారీ వెనుక టైర్ పేలి బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న డబ్బాలు, ప్యాకింగ్‌లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలు గగా హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బోల్తా పడిన లారీని పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకుని, త్రుటిలో పెద్ద ప్రమాదమే తప్పిందని పలువురు అభిప్రాయపడ్డారు.

22 ఆర్ పిల్ల కాలువకు గండి



జలుమూరు: కరవంజ సమీపంలో 22 ఆర్ పిల్ల కాలువకు 4వ డ్రాప్ వద్ద గండి పడింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల దిగువ ప్రాంత రైతులకు సాగు నీరందక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వర్షాలు లేక కాలువలో నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పిందని రైతులు చెబుతున్నారు. వర్షాలు పడి పిల్ల కాలువ గుండా నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటూ గండి మరింత పెద్దదై వరద నీరు పొలాల్లో చేరి పంట ముంపునకు గురై నష్టం వాటిల్లే దన్నారు. వంశధార అధికారులు స్పందించి గండిని పూడ్చే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

పలాస: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని లయన్స్ క్లబ్ వనిత విభాగం అధ్యక్షురాలు తర్లాన శ్వేతకుమారి, కార్యదర్శి మల్లా సంతోషి, కోశాధికారి తూముల గాయత్రి అన్నారు. మంగళవారం ఉదయపురం దుర్గామండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిర క్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. రాగోలు జెమ్స్ వైద్యులు 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

వజ్రపుకొత్తూరు: కోల్‌కతాలోని జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఉద్దానం గోపినాథపురంలో మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దేశంలో ఇలాంటి దుశ్చర్యలు జరగడం దారుణమన్నారు. నిందితులను త్వరగా పట్టుకొని కఠిన శిక్షలు వేస్తే ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మదనాల జోగారావు, కర్ని లింగరాజు, యువత, మహిళలు పాల్గొన్నారు.

వచ్చేనెల 19న జాతీయ లోక్‌అదాలత్


మాట్లాడుతున్న న్యాయాధికారి ప్రసన్న

టెక్కలి: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు టెక్కలి కోర్టుల సముదాయంలో సెప్టెం బరు 19న ఉదయం 10.30 గంటలకు జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించ నున్నామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకునేలా న్యాయవాదులు, పోలీసులు అవగాహన కలిగించాలన్నారు. లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

పలాస: జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబరు 14న నిర్వహించనున్నందున, దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పలాస జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్న కోరారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో లోక్‌అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కక్షిదారులు కేసుల నుంచి శాశ్వత విముక్తి పొందేందుకు లోక్ అదాలత్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల రచన డా.ముత్యం సొంతం


నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

పలాసరూరల్: చారిత్రక పరిశోధకుడు డాక్టర్ ముత్యం సేవలు మరువలేనివని వివిధ ప్రజా సంఘాల నేతలు అన్నారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో మంగళవారం ముత్యం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రచనా ప్రస్థానంలో 25 పరిశోధనాత్మక గ్రంథాలు రచించారని, ఈ ప్రస్థానం ఆయనకే సొంతమని, శ్రీకా కుళం గిరిజన సాయుధ పోరాటంపై ఆయన గ్రంథం భవిష్యత్తరాలకు నిఘంటువుగా నిలుస్తుందన్నారు. సుబ్బారావు పాణిగ్రాహి జీవిత చరిత్ర, సునాముది జీవధార, గరి మెళ్ల సాహిత్యం వంటి ఆయన రచనలు బహుళ ప్రాచుర్యం పొందాయన్నారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి గొరకల బాలకృష్ణ, ప్రజా రచయితలు కుత్తుమ వినోద్, వి.రాజారావు, ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు పి.కుసుమ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ముత్యం మృతి తీరనిలోటు

ప్రముఖ చరిత్ర పరిశోధకుడు డాక్టర్ కె.ముత్యం మృతి చెందడం తీరని లోటని, ప్రజా ఉద్య మాలు, సాంస్కృతిక రంగంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, సీపీఐఎంఎల్ లిబరేషన్, పౌరహక్కుల సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ముత్యం శ్రీకాకుళ ఉద్యమంపై, ఉత్తరాంధ్రపై 40 ఏళ్ల పాటు అధ్యయనం చేస్తూ రచనలు చేశారని, ఉత్తరాంధ్ర మట్టిలో చరిత్రక శకలాలను వెలికితీస్తూ తన రచనల్లో పొందుపరి చారన్నారు. ఆయన మృతి పట్ల ఆయా సంఘాల నేతలు వంకల మాధవ రావు, ఎం.రామారావు, పత్తిరి దానేసు, తామాడ సన్యాసి రావు, తెప్పల డిల్లీరావు, వైకుంఠరావు, జుత్తు వీరాస్వామి తదితరులు సంతాపం తెలిపారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బదిలీని నిలుపుదల చేయాలి

● తరగతులు బహిష్కరించి విద్యార్థుల నిరసన


ఆందోళన చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు బదిలీని నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు మంగళవారం తరగతులు బహిష్క రించి నిరసన చేపట్టారు. సరుబుజ్జిలి కళాశాల జేఎల్‌గా ఉన్న శ్రీనివాసరావు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వచ్చిన తరువాత పాఠ్యాంశాల బోధన సక్రమంగా ఉండడంతో పాటు విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దుతున్నారని, అయితే ఓ గెస్ట్ అధ్యాపకునితో వచ్చిన చిన్న తగాదా, కొందరు వ్యక్తుల ప్రోద్బ లంతో శ్రీనివాసరావును బదిలీ చేయడం తగదన్నారు. చదువుకు రాజకీయంతో ముడిపెట్టడం సరి కాదన్నారు. తక్షణం ఆయనను తిరిగి ఇక్కడికి తీసుకురావాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నిరసన విషయం తెలుసుకున్న ఆర్ఐవో ఎస్.తవిటినాయుడు వచ్చి తరగతుల బహిష్కరణకు కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమదాలవలస కళాశాల నుంచి ధనంజయరావును ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. అనంతరం విద్యార్థులు నిరసనను విరమించుకుని తరగతులకు హాజరయ్యారు.

పారిశ్రామికవేత్తలుగా తయారవ్వాలి

నరసన్నపేట: ప్రతి విద్యార్థి ఒక ప్రారిశ్రామికవేత్తగా తయారై మరికొందరికి ఉపాధి అవకాశా లు కల్పించాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్ మాస్టర్ ట్రైనీ మోహన్ అన్నారు. మంగళవారం ఒక ప్రైవేటు కళాశాలలో 'పారిశ్రామిక రంగం ప్రభుత్వ ప్రోత్సాహకాలు' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం అవసరమన్నారు. వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు మార్గం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నసాన మళ్లీ సస్యశ్యామలం

కోటబొమ్మాళి: చిన్నసాన పంచాయతీ పరిధిలో వ్యవసాయం మళ్లీ సస్యశ్యామలమవుతుందని టీడీపీ నేతలు వాన లక్ష్మి, ఎండ నాగేశ్వరరావు, శిమ్మ సింహాచలం అన్నారు. గత ఐదేళ్లుగా మర మ్మతులకు గురైె ట్రాన్స్‌ఫార్మర్‌ను మరలా ఏర్పాటు చేసి మంగళవారం ట్రైల్ రన్ వేశారు. త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

గ్రామసభలు విజయవంతం చేయండి

నందిగాం: ప్రభుత్వ ఆదేశాలు మేరకు మండలంలో శుక్రవారం నిర్వహించనున్న గ్రామసభ లను విజయవంతం చేయాలని ఎంపీడీవో టి.రాజారావు, ఉపాధి ఏపీవో ఎం.నాగరాజు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులు గుర్తింపు, ఆమోదం, ఇతర ప్రక్రియ సభలో ఉంటుందని, ఈ సభకు మేట్లు, వేతనదారులను అధిక సంఖ్యలో తీసుకురావాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సభలను జయప్రదం చేయాలని సూచించారు.

ఘనంగా పాతూరి జయంతి

సంతబొమ్మాళి: గ్రంథాలయోద్యమ నేత, కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణం జయంతిని మంగళవారం సంతబొమ్మాళి గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయాధికారి రామకృష్ణ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

నేడు మండల సమావేశం

మందస: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.రఘుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దానయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారలు హాజరు కావాలని కోరారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

హరిపురం: డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని మందస వైద్యాధికారి ఎం.సంపత్‌రావు అన్నారు. జిల్లుండ గ్రామంలో మంగళవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కాలువలు శుభ్రంచేసి, బావులు, బోర్లు, మంచినీటి వనరుల వద్ద బ్లీచింగ్ చల్లించాలని వైద్య, పంచాయితీ సిబ్బందిని ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ

నరసన్నపేట: పరిసరాల పరిశుభ్రతతో దోమలను నివారించవచ్చని మాకివలస, ఉర్లాం పీహెచ్‌సీల వైద్యులు శిరీష, సుజాత అన్నారు. మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో తిరిగి అవగాహన కలిగించాల్సిన సిబ్బంది కేవలం పీహెచ్‌సీ కేంద్రంలో ర్యాలీ నిర్వహించడంపై గ్రామస్థుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.





లోక కల్యాణార్థం అష్టాదశ శక్తిపీఠాల సందర్శనం

● ఆర్ఎస్ఎస్ ప్రతినిధి ప్రభోదానందస్వామి



కోటబొమ్మాళి: లోక కల్యాణార్థం అష్టాదశ శక్తిపీఠాలను పాదయాత్ర చేస్తూ సందర్శిస్తున్నానని వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి ప్రభోదానందస్వామి అన్నారు. ఆయన మంగళవారం కొత్తపేట కూడలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తరాదిలో బయలుదేరి 1,507 రోజులుగా 14 రాష్ట్రాల్లో సాగిన పాదయాత్ర చేసి ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్‌లో చేస్తున్నానన్నారు. సోమవారం ఉదయం నరసన్నపేటలో బయలుదేరి సాయంత్రానికి కొత్తపేట జంక్షన్‌కు చేరుకున్నానని ఊడికలపాడు శ్రీరామకృష్ణ రమణ కరుణ గీతాశ్రమంలో రాత్రి విడిది చేశానన్నారు. మంగళ వారం పాదయాత్రగా ఇక్కడి నుంచి బయలుదేరుతున్నానన్నారు. ఈ సందర్భంగా ప్రభోదానంద స్వామిని పలువురు ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, శ్రీరామ భక్తులు కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

రేపు ప్రపంచ జానపద దినోత్సవం

పలాసరూరల్: మాకన్నపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం 6 గంటలకు సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో యువశక్తి యువజన సంఘం సౌజన్యంతో ప్రపంచ జానపద దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వేదిక సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా పాటల తూటా ఎ.ఉదయ్ భాస్కర్ హాజరుకానున్నారని, స్థానిక కళాకారుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఏకపాత్రలు, జానపద కళాకారుల నృత్యాభినయాలు ఏర్పాటు చేశామన్నారు. వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కళాకారులు, కళాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

జానపద వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి హైస్కూల్ ఆవరణలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 'ప్రాచీన జానపద కళారూపాలు మానవుని జీవితంపై వాటి ప్రభావం' అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు గురువారం నీలావతిలో జరిగే ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా సండెమ్మతల్లి ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

నందిగాం: ఆకుల రఘునాథపురంలో నూతనంగా నిర్మించిన సండెమ్మతల్లి గ్రామదేవత ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన పెద్దింటి కృష్ణారావు దంపతులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు మావడి శ్రీనివాస్‌శర్మ, సింహాచలం శర్మ పర్యవేక్షణలో విశేష పూజలు చేశారు. మేళతాళాలు, తప్పెటగుళ్ల మధ్య గ్రామదేవత విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. గురువారం ప్రతిష్ఠతో పాటు అన్న ప్రసాద వితరణ చేపడుతున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

లక్ష్యసాధనతో విద్యాభ్యాసం సాగించాలి

పలాసరూరల్: విద్యార్థులు లక్ష్యసాధనతో విద్యాభ్యాసం కొనసాగించి ఉన్నత భవిష్యత్‌ను పొందాలని హెచ్ఎం ఎస్‌వీరమణ అన్నారు. బ్రాహ్మణతర్లా హైస్కూల్ ప్లస్ (బాలికల జూనియర్ కళాశాల)లో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో బాలికా విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనిని విద్యార్థినులు వినియో గించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థినులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు ఆర్. బాలశంకరం, సభ్యులు ఎ.కృష్ణారావు, జి.అప్పారావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం నగరపాలక సంస్థ
హెచ్చరిక

ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఈ క్రింది జాబితాలో పొందుపరిచిన స్థలము/ప్లాట్లు ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికముగా లే అవుట్లు వేసియున్నారు.

క్రమ సంఖ్య	అనధికారిక లే అవుట్ పేరు	విస్తీర్ణము (ఎకరాలలో)	సర్వే నెంబరు	గ్రామము	మండలము	లే అవుట్ వేసిన/గుర్తించిన సంవత్సరము
1	-	1.78	T.S.No.95P Rs.No.169	పాత శ్రీకాకుళం మండలవీధి	శ్రీకాకుళం	2022
2	-	0.44	T.S.No.33-2/B Rs.No.83/2	పాత శ్రీకాకుళంవార్డ్ మహాలక్ష్మినగర్ కాలనీ	శ్రీకాకుళం	2022
3	LSR రియల్ ఎస్టేట్	4.4	R.S.No.3/3,3/4	పెద్దపాడు	శ్రీకాకుళం	2022
4	సెగిడివీధి	0.95	T.S.No.454/6,7,8	పాత శ్రీకాకుళంవార్డ్ అరసవల్లి వెలమవీధి	శ్రీకాకుళం	2023
5	-	1.74	R.S.No.166P	పాత్రునివలస	శ్రీకాకుళం	2023
6	-	1.83	R.S.No.46P	బలగ రూరల్ చాపురం	శ్రీకాకుళం	2023

కావున పైన తెలియపరిచిన లే అవుట్ల నందు స్థలము లేక ప్లాట్లు కొనుగోలు చేయుట చట్టవిరుద్ధము మరియు ఈ ప్లాట్లకు అమ్మకము, కొనుగోలుకు వీలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయబడవు. మరియు ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు. మౌలిక వసతులు అనగా రోడ్లు, కరెంటు, నీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించబడవు. దీనిని గమనించవలసినదిగా విజ్ఞప్తి.

గమనిక:- అనధికారికముగా లే అవుట్ వేసి మరియు అమ్మకాలు చేయుచున్న స్థల యజమానులు లేదా డెవలపర్స్ పైన చట్టపరమైన చర్యలు తీసుకోబడును.

సం/- కమీషనరు(ఎఫ్.ఎ.సి)
శ్రీకాకుళం నగరపాలక సంస్థ



ఎప్పుడు కూలుతాయో?



జె.బైరిపురం-డీజీపురం రహదారిపై కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

- శిథిలావస్థలో వంతెనలు.. భయాందోళనలో ప్రజలు
- నిర్మాణాలపై గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

కంచిలి: గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణాలుగా గ్రామీణ రహదారులు, వంతెనలు దర్శనమిస్తున్నాయి. ఐదేళ్ల పాటు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి. వాటి నిర్వహణ, మరమ్మతులకు సంబంధించి కూటమి ప్రభుత్వంపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. మండలంలోని జె.బైరిపురం, డీజీ పురం గ్రామాలకు మధ్యలో ఉన్న వంతెన, నారాయణబట్టి వద్ద ఉన్న వంతెన, కర్తలి వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ వంతెనల మీదుగా బస్సులు, ఆటోలు, వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనలు కావడంతో ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో ఎప్పుడు కూలుతాయో అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.

కొత్త వంతెన నిర్మించాలి

జె.బైరిపురం, డీజీపురం మధ్య దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో భయభయంగానే రాకపోకలు సాగిస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలి.

-పూర్ణచంద్ర బిసోయ్, టీడీపీ నాయకుడు, డీజీపురం

ప్రతిపాదనలు పంపించాం

జె.బైరిపురం వద్ద ఉన్న వంతెన కోసం రూ.70 లక్షలు, కర్తలి వంతెనకు రూ.1.85కోట్లు, నారాయణబట్టి వంతెన నిర్మాణానికి రూ.42.5లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

-మోహన్‌రావు, జేఈఈ, ఆర్అండ్‌బీ, సోంపేట

చిన్నారి అనుమానాస్పద మృతి



వైష్ణవి మృతదేహం

కొత్తూరు: మండలానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అంగూరు గ్రామానికి చెందిన రగుతు రాంబాబు, సుప్రియ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. భర్తతో విభేదాల కారణంగా సుప్రియ కొత్తూరులో ఉంటూ పకోడి దుకాణం నిర్వహిస్తూ పిల్లలను పోషించు కుంటోంది. రాఖీ పండగ నేపథ్యంలో సోదరి ఇంటికి పార్వతీపురం మన్యం జిల్లా మంగళాపురం వెళ్లి సోమవారం తిరిగి వచ్చింది. రాత్రి రెండో కుమార్తె వైష్ణవి (4) వాంతులు చేసుకోవడంతో కొత్తూరు సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో కొత్తూరులో ప్రైవేటు వైద్యులకు చూపించారు. అక్కడ కూడా ఆమె పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మళ్లీ సామాజిక ఆసుపత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే వైష్ణవి మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. తల్లి సుప్రియ ఫిర్యాదు మేరకు కొత్తూరు ఎస్ఐ ఎంఏ అహ్మద్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీజీహెచ్‌లో వైష్ణవికి పోస్టుమార్టం నిర్వహించారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..



రైలు పట్టాలపై మృతదేహం

జలుమూరు: తిలారు రైల్వే గేటు సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. శ్రీకాకుళం ఆర్పీఎఫ్ ఎస్ఐ మధుసూదనరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పలాస నుంచి ఆమదాలవలస వెళ్తున్న రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడన్నారు. ఈయనకు సుమారు 40 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. చామనఛాయ రంగు, పసుపు రంగు టీ షర్టు, ఆకుపచ్చని తెల్లని పూలు కలిగిన లుంగీ, నీలిరంగు షార్టు వేసుకుని ఉన్నాడన్నారు. ఐదున్నర ఎత్తు అడుగుల కలిగి ఉన్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చెరువులో యువకుడి గల్లంతు



దుర్గారావు

వెదుళ్లవలస(పోలాకి): వెదుళ్లవలస గ్రామానికి చెందిన అమలాపురం దుర్గారావు మధ్యాహ్నం 3 గంటలకు కరణాల చెరువులో స్నానానికి దిగి గల్లంతయ్యాడని తండ్రి గొల్లవాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టిన జాడలేదని స్థానికులు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీనాయుడు, స్థానిక పెద్దలు, యువకుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గల్లంతైన యువకుడు అవివాహితుడని సమాచారం. ఘటనా ప్రాంతానికి ఎస్ఐ సత్యనారాయణ వెళ్లి పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి కేసులో నలుగురి అరెస్టు

ఎచ్చెర్ల: మండలంలోని ఫరీద్‌పేట గ్రామంలో కూన ప్రసాద్ అనే యువకుడిపై దాడి చేసిన కేసులో మంగళవారం నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఈ నెల 18వ తేదీ రాత్రి బహిర్భూమి కోసం మోటారు బైక్‌తో ప్రసాద్ వెళ్తుండగా కొంతమంది దాడి చేసినట్టు చెప్పారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

సీఎఫ్‌ను తొలగిస్తే సహించేది లేదు

- వెలుగు కార్యాలయం ఎదుట మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల గ్రూప్ లీడర్లు

సరుబుజ్జిలి: చిగురువలస, కొండ్రగూడ, వెన్నెలవలస క్లస్టర్ పరిధికి చెందిన డ్వాక్రా సంఘం సీఎఫ్ పల్లి శ్రీదేవిని తొలగిస్తే సహించేది లేదని చిగురువలస పంచాయతీకి చెందిన డ్వాక్రా సంఘాల గ్రూప్ లీడర్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వెలుగు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. 2010 నుంచి ఎటువంటి రిమార్కులు లేకుండా శ్రీదేవి పనిచేస్తున్నారని చెప్పారు. గడిచిన సాధారణ ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేశారన్న కక్షతో ఆమెను విధుల నుంచి తొలగించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు నిర్ణయం మార్చుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రూప్ లీడర్లు అప్పలనర్సమ్మ, నేతింటి రాజు, పల్లి కృష్ణవేణి, చల్ల పార్వతి, నాగమణి, లక్ష్మి, సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

- యథావిధిగా షెడ్ నిర్మాణ పనులు



షెడ్ నిర్మాణం కోసం కొలతలు వేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని పెద్దలంకాంలో పదేళ్ల కిందట ఓ స్థలంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం పునాది వేశారు. వివిధ కారణాలతో ఆ పనులు ఆగిపోయాయి. అయితే, ఆ స్థలంలో ఓ కుటుంబం షెడ్ నిర్మాణానికి ప్రయత్నాలు చేయడంతో కొంతమంది గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పనులు నిలుపుదల చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినా ఆ కుటుంబం షెడ్ నిర్మాణానికి పూనుకుంది. పనుల కోసం మంగళవారం కొలతలు వేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ వద్ద ప్రస్తావించగా.. షెడ్ నిర్మాణం చేపడితే తొలగిస్తామన్నారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

కవిటి/కంచిలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన చాంబర్‌లో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ మంగళవారం కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సాగునీటి కొరత, కొబ్బరి రైతుల పరిస్థితిని వివరించారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి సహకారం అందించాలని వినతిపత్రాన్ని అందించారు. పెద్ద శ్రీరాంపురం గ్రామ రెవెన్యూ మార్పు, పిడుగుపాటుకు గురై మృతి చెందిన తలతంపర పంచాయతీ లొండపు ట్టుగ గ్రామానికి చెందిన వ్యక్తి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి మాదిన రామారావు, పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ మంగళవారం వేర్వేరుగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం, పండ్లు అందజేశారు. అనంతరం శాంతిభద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై చర్చించారు.

వారానికోసారి ప్రత్యేకాధికారులు మండలాలకు వెళ్లాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్: వారానికోసారి ప్రత్యేక అధికారులు మండలాలకు వెళ్లాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, మండల స్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏఈఆర్వోలంతా ఎలక్టోరల్స్‌కు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచరాదన్నారు. బుధవారం నుంచి ఇంటింటి సర్వే చేయాలన్నారు. దీనిపై మండలాల వారీగా సమీక్షిస్తూ పెండింగులో ఉన్న దరఖాస్తులపై అలసత్వం పనికిరాదని స్పష్టం చేశారు. ప్రతీ ప్రభుత్వ పథకం మండల అధికారుల ద్వారా నేరుగా వెళ్లాలని ఆదేశించారు. కోర్టు కేసులుపై తక్షణమే స్పందించాలని, గృహ నిర్మాణాలపై మాట్లాడుతూ 100 రోజుల్లో లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. లేఅవుట్లలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధిహామీ పథకంపై ఈ నెల 23న జరిగే గ్రామసభకు అందరూ హాజరుకావాలని ఆదేశించారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకానికి సంబంధించిన టీకాల కార్యక్రమంపై గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఆర్వో అప్పారావు, ఆర్డీవోలు సీహెచ్ రంగయ్య, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, రిజిష్ట్రార్ మన్మథరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, కోపరేటివ్ రిజిస్ట్రార్ సుబ్బారావు, వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్, డీఎంహెచ్‌వో మీనాక్షి, డ్వామా పీడీ చిట్టిరాజు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, భూగర్భ గనులశాఖ డీడీ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దోమలను అరికడదాం: డీఎంహెచ్‌వో



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి: దోమలను అరికట్టడం ద్వారా ప్రాణాంతక వ్యాధులను నివారిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల నివారణకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 30 మలేరియా కేసులను గుర్తించామన్నారు. గత ఏడాది కన్నా కేసులు పెరగడానికి కారణం పక్క జిల్లాల నుంచి వ్యాప్తి చెందడమేనని అన్నారు. దోమ తెరలను వాడడం ద్వారా వాటి బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పీడీ సత్యనారాయణ, ఏఎంవో, ఎస్.శ్రీనివాస్, డీసీ శ్రీకాంత్, పి.మోహిని, సామాజిక కార్యకర్త మంత్రి వెంకటస్వామి, లక్ష్మణరావు, జయలక్ష్మి, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై దృష్టి సారించండి

అరసవల్లి: రానున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఓటర్ల జాబితా సవరణపై దృష్టి సారించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అక్టోబరు 18 వరకు బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా సవరణలు చేపడతారని, టీడీపీ పోలింగ్ ఏజెంట్లు, శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. వచ్చే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ ఓటర్ల జాబితాలే కీలకమని, పార్టీ శ్రేణులు అంతా ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఐటీడీపీ అధ్యక్షుడు ప్రధాన విజయరాం, బీసీ సాధికార సమితి సభ్యుడు కొమ్మనాపల్లి వెంకటరామరాజు పాల్గొన్నారు.

గొప్ప నాయకుడు రాజీవ్‌గాంధీ



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అరసవల్లి: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు పేర్కొన్నారు. ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని బెహరా మనోవికాస కేంద్రం విద్యార్థులకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, నాయకులు డీజీ మల్లిబాబు, ఎం.చక్రవర్తిరెడ్డి, మంత్రి నర్సింహమూర్తి, చింతాడ దిలీప్, కోత మధుసూదనరావు, కేవీఎల్ఎస్ ఈశ్వరి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రెల్ల సురేష్, కొత్తూరు శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లోపం ఉంది: మాజీ స్పీకర్ తమ్మినేని



మాట్లాడుతున్న సీతారాం

బూర్జ: మండలంలో వైసీపీకి నాయకత్వం లోపం ఉందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. డొంకలపర్తిలోని ఓ కల్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణ, పార్టీ కార్య క్రమాలు తదితర అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి 30 గ్రామ పంచాయతీల నుంచి తక్కువ మంది నేతలే హాజరుకావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పినప్పటికీ ఎక్కడ లోపం ఉందో అర్థంకావడం లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కె.దీప, జడ్పీటీసీ రామారావు, వైస్ ఎంపీపీ సూర్యారావు, వైసీపీ నాయకులు చిరంజీవినాగ్, కె.గోవిందరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బయట ఆహార పదార్థాలను అనుమతించొద్దు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని హాస్టళ్లకు బయట నుంచి ఆహార పదార్థాలను అనుమతించవద్దని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అధికారులకు సూచించారు. ఆమె వర్సిటీలోని హాస్టళ్లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి భోజనం చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, డిప్యూటీ వార్డెన్లు ఎం.చిన సుబ్బారావు, బి.వేణు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణను ఈ నెల 31న ప్రారంభిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో చేరేందుకు 19-45 ఏళ్ల లోపు మహిళలు అర్హులని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు నేరుగా శిక్ష కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. మరింత సమాచారం కోసం 95534 10809, 79933 40407 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎంపీడీవోగా రామ్మోహన్‌రావు బాధ్యతలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఎంపీడీవోగా ఎస్.రామ్మోహన్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మండల కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

లావేరు: మండలంలోని బొంతుపేట వద్ద అక్రమంగా తరలిస్తున్న అకేస్ కలపను విశాఖపట్నం రేంజ్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. నాలుగు లారీలు, మూడు ట్రాక్టర్లు సీజ్ చేశారు. ఒక్కొక్క లారీకి రూ.1.50 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు ఆయన తెలిపారు.

దోమల నివారణకు పూర్తిస్థాయి చర్యలు

శ్రీకాకుళం అర్బన్: వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆధ్వర్యంలో నగరంలోని 65 ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా దోమల మందు స్ప్రేయింగ్ చేశారు.

అర్హులందరికీ రుణాలు

ఇచ్ఛాపురం: అర్హత ఉన్న ప్రతీ సంఘానికి బ్యాంకు రుణాలు అందిస్తామని ఏపీఎం ఎస్.ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీపీ, ఉమెన్ లెడ్, సీడ్ కాపిటల్ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. అర్హులైన సంఘాలకు అన్ని రకాల బ్యాంక్ లింకేజ్, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చిట్టిబాబు, రాము, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



మొక్క నాటుతున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని చిరంజీవి అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సిద్ధయ్య పిలుపునిచ్చారు. గురువారం చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆలిండియా చిరంజీవి యువత అధ్యక్షుడు రవణం స్వామి నాయుడు పిలుపు మేరకు ఏడు రోడ్ల కూడలిలోని ఎంహెచ్ స్కూల్ ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు కె.మురళి, జి.కోర్లయ్య, లక్ష్మణ్, సత్యం, కన్నారావు, అప్పలరాజు, మోహన్, రాజేష్, వినోద్, రవి, లోకేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి

ఇచ్ఛాపురం: సమాజంలో మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా కృషి చేద్దామని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులైతే సమాజానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. కేసులు నమోదైతే ఆ వ్యక్తులు సమాజంలో ఉనికిని కోల్పోతారని అన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాబిన్ కుమార్ పాడి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

రాష్ట్ర ఫార్మసిస్టు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా సంతోష్

ఇచ్ఛాపురం: రాష్ట్ర ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల సురేష్‌బాబు ప్రకటించారు. ఫార్మసీ యాక్ట్ 1948 సెక్షన్ 42 ప్రకారం ప్రతీ మెడికల్ స్టోర్‌లో ఫార్మసిస్ట్ తప్పనిసరి అని, అనర్హులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా షెడ్యూల్ డ్రగ్స్ విచ్చలవిడిగా ఇవ్వడాన్ని ఖండిస్తున్నట్లు సంతోష్‌కుమార్ అన్నారు

ముఖ్యమంత్రిని కలిసిన విభూది

అరసవల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని తాడేపల్లిలో మంగళవారం శ్రీకాకుళం నగరానికి చెందిన టీడీపీ రాష్ట్ర జంగమ సాధికార సమితి డైరెక్టర్ విభూది సూరిబాబు కలిశారు. త్వరలో పార్టీపరంగా నామినేటెడ్ పోస్టులను భర్తీచేయనుండడంతో ముఖ్యమంత్రిని కలిసి.. పార్టీకి ఆయన అందించిన సేవలను వివరించారు. పదవుల భర్తీ విషయంలో తన పేరును కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీసీ న్యాయవాదులు

అరసవల్లి: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు మంగళవారం కలిశారు. జిల్లా ప్రజల చిరకాల వాంఛ విమానాశ్రయం అని, దీని ఏర్పాటుకు కేంద్రమంత్రి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అలాగే విశాఖ రైల్వేజోన్‌కు కృషి చేశారని ప్రశంసించారు. వెనుకబడిన జిల్లాగా పేరున్న శ్రీకాకుళాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారనే ఆశ, నమ్మకం ప్రజల్లో ఉందని తెలిపారు.

అంతర్జాతీయస్థాయి బ్యాడ్మింటన్ అంపైర్‌గా సూరిబాబు



శ్రీకాకుళం స్పోర్ట్స్: హైదరాబాద్‌లో మంగళవారం ప్రారంభమైన అంతర్జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు పోటీలకు జిల్లాకు చెందిన సంపతిరావు సూరిబాబు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. సూరిబాబు చిలకపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. గతంలో కూడా ఎన్నో అంతర్జాతీయ పోటీలకు అంపైర్‌గా పనిచేశారు. సూరిబాబును జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, కార్యదర్శి ఎం.అశోక్ కుమార్, డా. గూడేం సోమేశ్వరరావు, రాజేంద్రన్, జిల్లా పీఈటీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి అభినందించారు.

సూర్య యువతకు ఆదర్శం

రణస్థలం: మండల కేంద్రంలో జనసేన యువ నాయకుడు గొర్లె సూర్య చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభినందించారు. సూర్య గత 237 రోజులుగా రోజుకు 100 మంది నిరుపేదలకు సొంత ఖర్చుతో అన్నదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. యువత ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు సూర్య తెలిపాడు.

హెచ్ఐవీని తరిమి కొడదాం

ఇచ్ఛాపురం: హెచ్ఐవీ-ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని డాక్టర్ అఖిలేష్ మనోహర్ అన్నారు. బెల్లుపడ పీహెచ్‌సీలో మంగళవారం మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత భాగస్వామితో తప్ప ఇతరులతో లైంగిక సంబంధాలు పెట్టుకోవద్దన్నా రు. హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- కోల్‌కతా వైద్యురాలి ఘటనపై జిల్లాలో నిరసనలు



ఆమదాలవలస: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కవిటి: మాణిక్యపురంలో..

అరవసల్లి/రణస్థలం/కవిటి/ఆమదాలవలస: కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్య కళాశాలలో డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ జిల్లాలో పలుచోట్ల మంగళవారం నిరసన ర్యాలీలు చేపట్టారు. ఈ ఘటనను నిరసిస్తూ శ్రీకాకుళం రిమ్స్‌లో జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. 'ఆమె రోగుల ప్రాణాలు కాపాడింది.. మరి ఆమె ప్రాణాలను ఎవరు కాపాడారు?" అంటూ రిమ్స్ కళాశాల ఆవరణలో వలయాకారంలో నిల్చొని ఫ్లాష్‌లైట్లు వెలిగిస్తూ నినాదాలు చేశారు. రణస్థలంలో కూటమి నేతలు ఎమెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విష్వక్సేన్ తదితరులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కవిటి మండలం మాణిక్యపురంలో వైద్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులు కలిసి వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఆమదాలవలస పట్టణంలోని జనసేన కార్యాలయం నుంచి వన్‌వే జంక్షన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్లి మానవహారంగా ఏర్పడ్డారు. నిందితులను శిక్షిద్దాం..ఆడపిల్లలను రక్షిద్దాం అంటూ నినాదాలు చేశారు. శ్రీకాకుళంలో హోమియో వైద్యుల సంఘం జిల్లా శాఖ కార్యదర్శి డాక్టర్ కె.వివేకానంద ఆధ్వర్యంలో సభ్యులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు.



రణస్థలంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టిన దృశ్యం



అరసవల్లి: ఫ్లాష్‌లైట్లతో వలయాకారంలో నిలబడి నిరసన తెలియజేస్తున్న జూడాలు